# కండిషన్డ్ ప్లాంట్

''టప్... టప్... టప్...''మని చిన్న సవ్వడి. ఒక్కో చుక్కా బకెట్‌లో పడుతున్న సవ్వడి వసంత చెవుల పక్క నుంచే వినిపిస్తోంది.

ఎదురుగ్గా కంప్యూటర్ స్క్రీన్ మీద నేషనల్ ఇంటిగ్రేషన్ మీద చిత్రించిన యానిమేషన్ రన్ అవుతోంది. ఎన్నో రకాల మతాలకు చెందిన వ్యక్తులు వాళ్ళ సాంప్రదాయ సిద్ధమైన దుస్తులతో, వేగంగా ఒకరి చేతిని ఒకరు కలుపుకుంటూ, *గబగబా* అందరూ కలిసి పువ్వులై పోతూ, ఆ పూవులు *గబగబా* కదిలి, వేయి రేకుల పద్మంలా వికసించి ఆ రేకులన్ని ఒక్కో మనిషిగా మారిపోవటం, అందరిదీ ఒకే భాష, ఒకే కులం... ఒకే భావం అన్న సందేశం.

వసంత కళ్ళ ముందు అన్నీ అలుక్కుపోతున్నాయి. చెవుల్లో సముద్రం హోరు మొదలైంది.

''పంపు కట్టేశానా... నీళ్ళు కారిపోతున్నాయేమో...'' ఎందుకొచ్చిందో ఆ సందేహం. ఇక వదలకుండా అదే ఫీలింగ్. నీళ్లు వరదలై పోతున్నాయి. ఇల్లంతా జలమయమై పోతోంది. వళ్ళంతా చెమట పట్టేసింది. జాకెట్టు తడిసి ముద్దయిపోయింది. కంప్యూటర్ ముందు నుంచి లేచి నిలబడింది వసంత. ఇన్‌చార్జి సంజీవి సీరియస్‌గా బొమ్మలు వేస్తున్నాడు. ఒక పూల మొక్క *గాలికి* అలలా కదలాలంటే ఎన్ని వంపులు తిరగాలో అన్ని బొమ్మలు, దీక్ష... తపస్సు.

వసంత ఒక్క నిమిషం ఆగింది. చెవిలో హోరు తగ్గలేదు. ''సర్... నేను ఫైవ్ మినిట్స్‌లో వచ్చేస్తాను''

సంజీవి తలూపాడు.

గబగబా మెట్లు దిగి, అటుగా వెళుతున్న ఆటో ఆపింది వసంత. 'పల్లవీ అపార్ట్‌మెంట్స్' దగ్గర ఆటో ఆగీ ఆగకుండానే 'ఒక్క నిముషం ఇప్పుడే వచ్చేస్తానని చెప్పేస్తూ పైకి పరుగు తీసింది. ఇస్త్రీ చీర తడిసి ముద్దయింది. మొహం చమటలు పట్టేసి చెవుల పక్కల నుంచి జారుతోంది. తాళం తీసి లోపలికి పరుగెత్తి బాత్‌రూమ్‌లోకి తొంగి చూసింది. అంతా డ్రైగా ఆరిపోయి ఉంది. చుక్క నీళ్ళు లేవు. చెవుల్లో హోరు తగ్గింది. కళ్ళు తిరిగినట్లయింది. కళ్ళనీళ్ళు వచ్చేస్తున్నాయి. ఆపినా ఆగకుండా ఇంకా ఈ ఏడుపు ఆగదు. వసంత మంచం మీద పడింది. వెక్కి-వెక్కి ఏడుస్తోంది వసంత. గుప్పిళ్ళతో దిండుమీద కొట్టి, మొహం పైకెత్తి జాలిగా ఏడ్చింది.

''టెన్షన్ తగ్గించుకో వసంతా... ఎలా ఆత్మవిశ్వాసం పోగొట్టుకొంటున్నావో గమనించు. నిలబడాలి... ఇప్పుడే గట్టిగా నిర్ణయించుకోవాలి'' డాక్టర్ గొంతు ఓదారుస్తున్నట్లు అనిపించింది. కళ్ళు తుడుచుకుని చుట్టూ చూసింది. రోజూ చూసే ఇల్లు. చాలా శుభ్రంగా ఎంతో పొందిగ్గా ఇల్లంతా మనీప్లాంట్స్. నీడ... ఎండ అవసరం లేని నీరు తప్ప ఇంకేవీ కోరని చెట్లు. అవి ఎదిగేందుకు లేదు. ఎంతవరకూ అందమో అంతవరకే ఎదగనిచ్చి ఎలా ఉంటే అందమో, ఆ షేప్‌లో కత్తిరించి పద్ధతిగా పెంచే చెట్లు. అచ్చం వసంతకు మల్లే. తనను ఆ చెట్లతో పోలిక తెచ్చుకోగానే మళ్ళీ పెద్దపెట్టున దుఃఖం వచ్చింది వసంతకు. కింద నుంచి హారన్ వినిపిస్తోంది. టక్కున అనవసరమైన కొమ్మను కత్తిరించినట్లే ఏడుపు ఆగిపోయింది. గబగబా చన్నీళ్ళతో మొహం కడుక్కుని, చీర విప్పి పడేసి మార్చుకొన్నట్లు తెలీకుండా, కాస్త దగ్గరగా అలాగే వుండే మరో తెల్లచీర బీరువాలోంచి లాగి కట్టుకొంది. నాలుగైదు చీరెలు కిందికి జారేయి. కసిగా వాటిని బీరువాలోకి విసిరేసి కిందికి జారకుండా నొక్కింది. తలుపులు దగ్గరకు లాగి తాళం నొక్కి ఆటోలో కూలబడింది. కన్నీరంతా కార్చేశాక మనసు ప్రశాంతంగా ఉంది. కళ్ళు తేటగా ఉన్నాయా? లేదా? పర్స్‌లోంచి చిన్న అద్దం తీసి మొహం పరికించి చూసింది. ఆటోడ్రైవర్ గమనించాడేమోనని అనుమానం తోచి, అతని వంక చూస్తూ జుత్తు సరిచేసుకుంది. మొహం ప్రశాంతంగా ఉంది. వసంత తృప్తి పడింది. ఆటో వెళుతుంటే చల్లని గాలి మొహానికి తగులుతోంది. పర్స్ పక్కన పడేసి రోడ్డువంక చూస్తూ కూర్చుంది వసంత.

''ఏదో తనలో వచ్చింది. ప్రతిదానికి టెన్షన్... భయం... అనుమానం... తన ధైర్యం తెగువ ఏమై పోతున్నాయో... ఎక్కడో ఓ సంకోచం. ఎవరో తనను గమనిస్తున్నారనే ఆలోచన... తనెందుకిలా తయారయింది? ఈ సందు దాటితే పోలీసుస్టేషన్. దూరంగా ఎర్రని రాళ్ళ

వరసతో పొట్టి పిట్ట గోడ. సంవత్సరాల తరబడి తను నడిచిన దారి. తనకు నీడ ఇచ్చిన ఆ చెట్టు. కొంచెం ముందు ఎర్రని ఉమ్ములతో నిండిన ఇసుకతొట్టి. అక్కడి దాకా వచ్చాక తను చాలా జాగ్రత్తపడుతూ ఆ ఉమ్మితొట్టి దాటుకుంటూ వెళ్ళటం. ప్రతిసారి పైటకొంగు గాలికి ఎగిరి తొట్టిమీద వాలుతుందేమోనని వెర్రి భయం!

"ఎందుకే భయం వెర్రిదానా... నీ పరిస్థితులకి నీకు ఉమ్ములొక లెక్కా. అడ్టల్టరీ కేసులో ఇరుక్కుని రైటర్ ముందు నిలబడే నువ్వు... ఆ ఉమ్మితొట్టి కంటే ఏం ఎక్కువా?"

వసంత కళ్ళు నిండుకొన్నాయి.

ఆటో అతన్ని ఆగిపొమ్మంది. మీటర్ చూసి డబ్బు ఇచ్చేసి పోలీసుస్టేషన్ వైపు వెనక్కి నడవటం మొదలుపెట్టింది. ఈ చివర్న బస్ దిగి తను ఎన్నో మార్లు నడిచిన దారి. అప్పటికీ... ఇప్పటికీ... వెల్లాచెదరైన తన బతుకులా రిపేర్లు ఎరగని రోడ్డు. ఇటు నుంచి నడుస్తూ వెళ్ళి ఆ చెట్టు దగ్గర నిలబడి ఎర్రెర్రని పూలగుత్తులు పూసిన ఆ చెట్టు ఆకులు అసహనంగా గిల్లుతూ, అందరూ చూస్తున్నారేమోనన్న భయంతో, అటూ ఇటూ దిక్కులు చూసేది మొదట్లో. తరువాత అలవాటైపోయింది. ఒకే ఒక ఆశ. తన పాపని తనకు ఇస్తారేమోనని. మాటిమాటికీ అరెస్టయింది ఒకే ఒక నేరం కింద. అడల్ట్రీ కేసు. నిజంగా ఎవరైనా ఉంటే బావుండుననిపించిన క్షణాలెన్నో. వసంతకు నవ్వొచ్చింది.

ఇదేం గొప్ప విషయమా? వంశీ ఏం చేశాడు?

మొట్టమొదటిసారి ఆఫీస్ అయ్యాక బయటకి వస్తుంటే అరెస్ట్ వారెంట్‌తో పోలీసులు వచ్చారు. స్టాఫ్ అందరి ముందూ అరెస్టు వారెంట్ చూపించి జీప్ ఎక్కించటం మొదటి మెట్టు. రెండు గంటల తరువాత స్టేషన్‌కు వచ్చి పది వేలు కట్టాడు వంశీ. ఆ రెండు గంటలూ రెండు యుగాలు. నెమ్మగా ఉన్న ఆ వరండాలో బెంచీ మీద కొంగు కప్పుకొని కూర్చుంది. వెనకగా ఉన్న కటకటాల్లో పదిమంది మనుషులు బోనులో జంతువుల్లాగా. వరండా పక్కగా పిట్టగోడ దగ్గర ఒకడు అడ్డంగా పడి ఉన్నాడు. వాడి నెత్తిన నీళ్ళు గుమ్మరించారు. బాగా కొట్టారు గావును శవంలా పడున్నాడు. పదిమంది కానిస్టేబుల్స్. అందులో ఇద్దరు ఆడవాళ్ళు... వరసకో తిట్టు చొప్పున దీవిస్తూ, అందులో ఒకావిడ రాత్రి జరిగిన సంఘటన ఏకరువు పెడుతోంది. దగ్గర్లో దుర్గమ్మ బ్రోతల్ హౌస్ ఉంది. నెల మొదటి రోజే మామూలు పంపేస్తుంది దుర్గమ్మ. మిగతా ఎనిమిది మంది పూరంతా బీటువేస్తూ రెండు చేతులా సంపాదిస్తుంటే, అందుట్లో తమకు వాటా లేకపోవటం ఘోరం. బ్రోతల్ కేసు దగ్గర్నుంచీ వచ్చే పైసలే దక్కుదల. ఈ నెల అదీ రాలేదు. ఏమైందో తెలుసుకుందామని అలా దుర్గమ్మ ఇంటికి రిక్షాలో బయల్దేరిందట. అక్కడ గుమ్మం దగ్గర రిక్షా దిగగానే పెట్రోలింగ్ చేస్తున్న సి.ఐ. జీపు ఆపాడట. ఒక్క సైగతో జీపులోకి

రమ్మని తిన్నగా స్టేషన్ దగ్గర దింపేసి వెళ్ళిపోతూ, 'చివరకు కంపెనీలో తేలతావన్నమాట' అనేశాడట. మగాళ్ళు సంపాదిస్తుంటే చూసీ చూడనట్టు ఊరుకొని వాటాలు దొబ్బే కొడుకు ఆడాళ్ళ మీద పడిపోవటం ఏమిటని ఆవిడ ఉక్రోషం. 'ఆడాళ్ళకి అది లాయకీ కాదు' అని ఇంకో హెడ్డు. ఆవిడను ఊరుకోబెట్టాలని చూశాడు. ఆవిడ ఇక అతని మీద పడిపోయింది. 'ఇది ఉద్యోగం... ఒక కుళ్ళులో దిగటానికి ఇష్టమై వచ్చేశాక ఇక ఆడేమిటి? మగేంటి? ఆడాళ్ళని రాత్రిళ్ళు అరెస్టు చేసి తీసుకొచ్చి స్టేషన్‌లో పెట్టి ఆళ్ళు సంపాదించుకున్న డబ్బులు లాగి, బిర్యానీ పాకెట్లు తెప్పించుకొనే దొంగ కొడుకులకి నీతి గురించి మాట్లాడే పనిలేదండి. ఇది కేవలం ఉద్యోగం. డ్రస్సు వేశాక ఇంకా రకరకాల న్యాయాలు ధర్మాలు ఎందుకూ? ఇదీ ఆవిడ వాదన. ఆవిడ బాధ కూడా అదే. చివరకు పోలీసు బతుకులో కూడా తేడాలేనా అని.

వసంతకూ అదే తోచింది. తనెందుకు పోలీసుస్టేషన్ వరకు వచ్చిందీ? లేడీ కానిస్టేబుల్ కొచ్చిన సమస్యే తనదీనూ... కొంచెం తేడా. చదువుకొన్న భార్య కావాలి. సొసైటీలో తిరగ నేర్వాలి. అందంగా ఉండాలి. కట్నం ఇవ్వాలి. సంపాదించాలి. ఇంతవరకూ తనూ మూర్తీ సమానమే. ఇంకా చెప్పాలంటే తన జీతం మూర్తి జీతం కంటే ఎక్కువ. అయితే పద్ధతిగా కత్తిరించిన మొక్కలాగా తను ఎక్కడికక్కడ తీరుగా ఉండాలి. ఎలా కుదురుతుంది? తొమ్మిది గంటలకు పనులు ముగించి ఇంటి నుంచి బయటపడితే టిఫిన్ తినటం దగ్గర నుంచి అన్నీ ఊరి మీదే. పనిచేసేది కంప్యూటర్ సెక్షన్. నలుగురు ఆర్టిస్టులు ఇరవై మంది కంప్యూటర్ ఆపరేటర్లు. ఇద్దరు ఇంజనీర్లు. పని... పని... పని... ఏకదీక్షతో శ్రమ... మధ్యలో టీ తాగాలంటే బిలబిలమంటూ పోవటం, టిఫిన్ తినాలంటే తినేయటం. ఏది పడితే ఎక్కడ పడితే ఎవరితోనైనా కలిసి, ఎవరు తోడు దొరికితే వాళ్ళతో... ఇది తప్పు అనుకొనేందుకు అవకాశం లేని పరుగు. ఉద్యోగం తీరది. కచ్చితమైన సమయం ఉండదు. ఏదో వేళకి ఏదో తినటం... పనిలో పడిపోవటం. డ్యూటీ అవగానే కొంపకి చేరాలి. బస్ కోసం కూర్చుంటే అవుతుందా... ఎవరు డ్రాప్ చేస్తే వాళ్ళ వెనక. వాళ్ళకీ తనకు మల్లే నవ్వేందుకు కూడా ఓపికుండదు ఇన్ని గంటల శ్రమ తరువాత. మూర్తి చెప్పుకుపోయే పద్ధతికి తన జీవితంలో అవకాశం లేదు. నవ్వితే విరగబాటు, జోకులేస్తే వెకిలితనం, ఎక్కడికక్కడ కండిషన్ చేయటం ఉద్యోగం... సింగిల్ ఉమన్ లైఫ్ తనకు అలవాటైన జీవితం అందుట్లోంచి భార్య పాత్రలోకి ట్రాన్స్‌ఫర్. అంతవరకే. మహా అయితే రాత్రిళ్ళు ఒంటరిగా పడుకోకుండా మూర్తి తోడు వచ్చింది. మిగతా జీవితంలో ఏం మార్పు? రోజురోజుకీ మూర్తిలోనే మార్పు వచ్చింది. నిద్ర లేచిన దగ్గర నుంచి విరామం లేని ఫోన్ కాల్స్. మార్కెటింగ్ స్టాఫ్‌తో సంప్రదింపులు. ఏ డిజైన్ ఎలా క్లిక్ అయిందో, ప్రోగ్రెస్ ఎలా ఉందో, కొత్త సబ్జెక్ట్ ఏమిటో, ఎన్నో అవసరార్థం వచ్చే ఫోన్స్. పక్కనే పేపర్ చదువుతూ కూర్చుని కూడా ఒక్క ఫోన్ కూడా తీయడు. తను ఆపరేటర్ పాత్ర వేయడట. ఏ స్నానం చేస్తున్నప్పుడో ఫోన్ వస్తే మహా కేర్‌లెస్‌గా జవాబు ఇవ్వటం.

పైగా తనకు తెలియదని చెప్తాడు. అవతల మనిషికి కన్‌ఫ్యూజన్. 'వసంతా టరమ్స్ బాగా లేవా' అంటారు. ఏమని చెపుతుంది? ఏ టరమ్స్ బాగా లేవు. పాప పుట్టాక మరీ ఎక్కువైంది. ఆ పాప సంరక్షణ అంతా సమస్యే. బహుశ మూర్తి కావాలని దాన్ని పెద్ద సమస్య చేశాడు. తను ఏర్పాటు చేసుకున్న ఏ మనిషినీ నిలువనీయలేదు. తనొక్కడే పాపతో కష్టాలు పడుతున్నానని తగవులు. మరి ఉద్యోగం మానేయమని చెప్పడు. మూర్తి జీతం ఒక్కటే చాలదు. తన వర్క్ సిన్సియారిటీ వల్లనో కంపెనీ ప్రోగ్రెస్ కనిపిస్తేనో జీతం పెరిగిందంటే మూర్తి ఒక్కనాటికీ ఒప్పుకోడు. సాధారణంగా వసంత వంటి మోడరన్ గరల్స్‌కు కాస్త విరగబాటు వెకిలితనం ఉన్నవాళ్ళకు ఇలా జీతం పెరగటం మామూలే అన్నాడు. తను ఆడది కాబట్టి తన చుట్టూ ఇంతమంది చేరతారట. పోనీ అలాగే అనుకోనీ, అందులో తన తప్పేం ఉందీ? తను ఏడుపు మొహం పెట్టేందుకు లేదు. పెడితే బ్రాడ్‌మైండ్ కాదుట. ఊరికే సొసైటీ ఇంత దారుణంగా ఉందీ అని హెచ్చరిక మాత్రం చేస్తాడట. అంతే అందమైన ఇల్లు. ఖరీదైన అలంకరణ. అది అందరూ చూడాలనే కాంక్ష. వచ్చిన వాళ్ళ ముందు తామిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉంటున్నారనే ప్రదర్శన. నటించీ... నటించీ అలిసిపోవటమేనా సంసారమంటే. నాలుగు గోడల మధ్యన నిరంతరం తగూలే. శత్రు శిబిరంలోకి అడుగుపెట్టినట్లు తను కంగారుగా ఉండేది. ఏం మాట్లాడితే ఏమవుతోందోనని నెమ్మదిగా చెక్ చేసుకొనేది. ప్రతిదీ ఆత్మపరీక్షే. తనది తప్పా? రైటా? పోనుపోనూ... అది బలహీనత అయింది. అన్నీ అనుమానమే. తలుపులు వేసిందా లేదా? పాలలెక్క సరిగ్గా ఉందా? లేదా? ఇంటద్దె ఇచ్చామా లేదా? పాపాయికి రెండోసారి పాలు తాగించానా లేదా? అన్నీ సందేహాలే. భయాలే! ఆఫీసులో అన్నీ మర్చిపోయానేమోనని రెండుసార్లు చెక్ చేసుకొనేది. సంజీవి వినుక్కొనేవాడు ఒకే విషయం పదేపదే చెపుతుంటే. చేసే పని మధ్యలో ఆపి మెమొరీ చెక్ మొదలుపెట్టి, కరెంట్ పోతే మీటర్ పోతుందేమోననే అనవసరపు భయం ఇలాగయితే ఉద్యోగం ఎలాగా చేయటం. సరిగ్గా వంశీ అప్పుడే ఆఫీసులో జాయిన్ అయ్యాడు. కొత్త ప్రాజెక్ట్ వర్క్ ఒప్పుకోవటం గంటలు గంటలు పని. రెండు కంపెనీల ప్రాడక్ట్‌కి డిజైన్ చేయటం టేబిల్ దగ్గర నుంచి ప్యాకింగ్ వరకూ, ఎంతెంత డబ్బు. రెండు చేతులా సంపాదన. మూర్తికి డబ్బు కావాలి. సౌకర్యాలు కావాలి. బతుకు ఇంకెలా కావాలో తేల్చుకోలేక పోవటం అతని తప్పా? దీన్లోంచి ఎలా బయటికి రావాలో తెలియకపోవటం తన తప్పా? అతనిలో రెండు ముఖాలు. డబ్బు సంపాదించి పెట్టే గొప్ప యంత్రం. ఇల్లు సౌకర్యాలు బ్యాంక్ బాలెన్స్‌లు. రెండోది వినయంగా రెండో కంటికి కనిపించని భార్య. తనకు శుశ్రూష చేసి తన ఇగోని భరించగలిగే ఇల్లాలు. ఈ రెండూ ఒక మనిషిలో ఎలా సాధ్యం. తనను కేవలం భార్యగా చూడగలిగే సాహసం... ధైర్యం... అవును సరిగ్గా చెప్పాలంటే అదే అతను ఎలా పోగొట్టుకున్నాడో తెలియదు. తనను చూస్తే ఒక జంకు. తను అలసిపోతుందని మూర్తికి తెలుసు. పగలంతా కంప్యూటర్ మీద పనిచేస్తే కళ్ళు మూతలు పడిపోతాయని తెలుసు. కానీ

అతనికి చాలా తీరుబడి. తనను అలరించి సుఖపెట్టే భార్య కావాలనే లోలోపల కోరిక. మంచంమీమ్మద వాలిపోతే తనను కనీసం మేలుకున్నావా అని అడిగేవాడు కాదు. అతనికి ఒక వినయం వచ్చింది. అది వినయమా? యజమానిపట్ల చూపించే ఒక విధేయత. భరించే భర్తను భార్య గౌరవించినట్లు, అటు తరువాత అతను తనకు దూరం అయినట్టే. సరిగ్గా అప్పుడొచ్చాడు వంశీ.

అతనో జలపాతం. గాలికి చిన్నరెమ్మ ఊగినా దాన్ని కవిత్వీకరించే ఊహాజీవి. కవి. స్త్రీలపట్ల అంతులేని గౌరవం. తల్లి టీచర్. కుటుంబం కోసం ఆవిడ ప్రతి నిముషం పడే తపన చూస్తూ పెరిగాడు. మార్కెటింగ్ రంగంలో తను చేసే డిజైన్ వర్క్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి ఎంతో అభిమానించేవాడు. అతని కబుర్లంటేనే వళ్ళు మంట మూర్తికి. లేదా తను ఎవరిని అభిమానించినా సహించలేక పోయేవాడో మరి. అతను ఫోన్ చేసినా చాలా విసురుగా సమాధానం చెప్పేవాడు. కొత్తగా అడ్వర్టయిజ్‌మెంట్ సెక్షన్ ఒకటి స్టార్ట్ చేశారు ఆఫీస్ వింగ్ లాగా. దానికి హోటల్ సరోవర్‌లో ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. అనుకోకుండా వెళ్ళవలసి వచ్చింది అక్కడికి. పనంతా అయ్యాక కాఫీ తాగుతూ ఉండగా వచ్చాడు మూర్తి. ఆఫీస్‌కు వస్తే ఇక్కడ సరోవర్‌లో వంశీతోపాటు ఏదో వర్క్‌లో వుందని చెప్పారట స్టాఫ్. అంతే మండిపడిపోతూ వచ్చాడు. ఆఫీస్‌లో పనిచేసే ఉద్యోగులకు కండిషన్స్ అంటూ ఉంటే అవి ఆఫీసుకు సంబంధించినవి మాత్రమే అయి ఉంటాయి. ఇంటికీ, వ్యక్తి గత జీవితానికీ, ఆఫీస్ బతుక్కీ కండిషన్స్ వర్తించవనీ, అదే ఇల్లంటే కేవలం నమ్మకం... అభిమానం మాత్రమే అని అర్థం చేసుకొనే శక్తి మూర్తికి లేదు. హోటల్‌లో ఏదో జరిగిపోయినంత హంగామా చేశాడు. ఆ చాప్టర్ అంతటితో ముగిసిపోయిందనుకుంది. కానీ... పాపను తీసుకొని తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళిపోయాడు. యుద్ధం ముగిసిపోలేదు. ఒక నిశ్శబ్దం మూడు రోజుల తర్వాత బద్దలైంది. ఆఫీస్‌లో తనను అరెస్టు చేశారు అడల్టరీ కేసు కింద. మూర్తి పగ తీర్చుకున్నాడు. డబ్బు చాలా పనులు చేస్తుంది. పాతివ్రత్యం విషయంలో పోలీసులకు గొప్ప పట్టుదల ఉంటుందనుకొంటా. అతనికి చాలా సహకరించారు. 'బిడ్డ తల్లికి అదేం రోగం... ఇదేం పోయే కాలం..... బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకొందన్నారు' తను మాట్లాడిందా? లేదు. అందం కోసం పెంచి అదనపు పెరుగుదలను తుంచేసేందుకు తను మనీప్లాంట్ కాదు. ఎదిగే క్రమంలో ఎప్పుడూ పైమెట్లే ఉంటాయి. ఇది కెరీర్‌కు సంబంధించిన వ్యవహారం. కొన్ని మెట్లే ఎక్కనిచ్చి ఇంతవరకే ఎదుగూ అంటూ బతుకుని ఎవరూ డిజైన్ చేయలేరు. మూర్తి ఆ ఎదుగుదలను చూసి తీరవలసిందే. అదే మూర్తి ఎదిగే క్రమంలో ఉంటే భార్యగా తను చాలా గౌరవంతో, ఆపేక్షతో, అనుబంధంతో చూస్తూ మరింత పెరిగేందుకు సహకరించేది. ఆ పని మూర్తి ఎందుకు చేయలేకపోయాడు. మేల్ ఇగో అడ్డం వచ్చింది.

అలవాటైన చోటు అది. నెమ్మదిగా ఎర్ర పూల చెట్లు దాటి, ఉమ్మి తొట్టి జాగ్రత్తగా తప్పించుకొని నాలుగు మెట్లెక్కి చెమ్మగా ఉన్న వరండా దాటి రైటర్ దగ్గరికి వచ్చింది వసంత. రైటర్ తలెత్తి చూశాడు. కూర్చోండి అన్నట్లు తల వూపేడు. వసంత బల్లమీద కూర్చుంది. చాలా సహజంగా తనకు అలవాటైన పని అన్నట్లుగా. తలెత్తి చూస్తే ఒకళ్ళిద్దరు పోలీసులు నవ్వు మొహం పెట్టారు. వసంత పెదాలు అతికించినట్లు అతుక్కుని మళ్ళీ విడివడ్డాయి.

''మొన్ననో కొత్త ప్రోగ్రామ్ డి.డి. లో చూశానండి. మీ గొంతు గుర్తుపట్టేశాను'' అన్నాడు రైటరు ఫైలు తిరగేస్తూ.

''చాలా మంచి ప్రోగ్రామ్. మా పిల్లలు వదలకుండా చూస్తారు'' అన్నాడు మళ్ళీ.

వసంత కళ్ళు చెమర్చాయి. టీనా పప్పీతో తన ప్రోగ్రామ్.

టీనా పప్పీ... టీనా... తన పాప. తన కంట పడని తనతో ఆడుకోని తన పాప... తన ఊహల్లో తన పాప అల్లరి... ఎన్నెన్ని తమాషాలు చేయగలదో, ఎంత నవ్వించగలదో తన ఊహల అల్లిక. టీనా తన కుక్కపిల్లను వెంటేసుకొని చేసే గమ్మత్తులు... యానిమేషన్‌లో ఎర్రని బుగ్గలతో బుట్టబొమ్మలాంటి టీనా. ఉంగరాల జుట్టు మొహం మీద పడుతుంటే తల ఎగరేసే టీనా... ఇప్పుడు మార్కెట్‌లో టీనా షర్టులు గౌన్లు , టీనా మోడల్ బ్యాగ్స్.

తల విదిలించింది వసంత.

ఇప్పుడు ఇదంతా వేస్ట్. తన తెలివితేటలు తన జీవితాన్ని లాగేసుకొన్నాయి.

వసంత ముందుకు వంగి రైటర్ టేబిల్ గట్టిగా పట్టుకుంది. చేతులు నెర్వస్‌గా వణుకుతున్నాయి.

నాకు పాపని ఇవ్వరంటారా?

రైటర్ కాసేపు మాట్లాడలేదు. పెన్ను కింద పెట్టేసి వసంత వైపు జాలిగా చూశాడు.

''మళ్ళీ కొత్త కేస్ ఫైల్ చేశారమ్మా. నీలాటి క్యారక్టర్ లేని మనిషి దగ్గర తన పాపను వదలటం ఆయనకు ఇష్టం లేదటమ్మా. ఐ.జి. గారికి మూర్తిగారు మంచి స్నేహితులు. కేసు తేలదు.''

'క్యారక్టర్ లేని మనిషి...'

వసంత గుండె గబగబా కొట్టుకుంది. చెవుల్లో హోరు మొదలైంది. ఒళ్ళంతా చెమటలు పట్టేస్తున్నాయి.

''పాపను ఇవ్వరంటారా...'' అన్నది బలహీనంగా.

''చూద్దాం. రేపు వాయిదా వుందిగా''

వసంత నిరసంగా లేచింది. మెట్లు దిగుతూ పైటకొంగు గాలికి ఎగరకుండా గట్టిగా పట్టుకుంది. అక్కడో ఉమ్మితొట్టి. ఇప్పుడు కొత్త తొట్టి. రంగరంగుల ప్లాస్టిక్ తొట్టి. అందులో తులసెమ్మను పెడితే అందరూ దణ్ణాలు పెట్టేంత పవిత్రత వస్తుంది. పూలమొక్క పెడితే మరోసారి చూసేంత ముచ్చటగా ఉంటుంది. ఇప్పుడు ఉమ్ములు వేస్తుంటే అలా అంటరానిదయింది. తొట్టి తప్పేముంది. ఇదివరకెప్పుడో కట్టు బానిసలుండేవారు. కేవలం పనికి, పడక్కి పనికివచ్చేవారు. వాళ్ళు చూపించగలిగే వినయం గొప్పది. భర్త స్థానంలో ఉన్నవారి అహం తృప్తిపడేది. వాళ్లకి కేవలం శరీరాలు ఉంటే చాలు. కొన్నాళ్ళకి మెదళ్ళవసరం వచ్చింది. మెదళ్ళంటూ వచ్చాక, ఆలోచన మొదలయ్యాక , ప్రశ్న తలెత్తేక పెరుగుదలకి అంతం ఉంటుందా? కత్తిరించి అందంగా అమర్చేందుకు అదేమైనా మనీప్లాంటా? మెదడు పెరుగుదలకు కొలతలు తూకాలు అవసరమా? దాన్ని భరించలేకపోవటం గురించి మెదడే అవసరం పడినప్పుడే ఆలోచించుకోవాలి. మూర్తి బాధ తనకు అర్థం అయింది. ఆఫీసులో తన పై ఆఫీసర్‌ను భరించి, తోటి స్నేహితుడి తెలివి భరించి, ఇక ఇంట్లో పెళ్ళాం తెలివీ భరించాలంటే అతని వల్ల కాలేదు. తనను భరించలేకనే తనతో పోరాటానికి దిగాడతను. ఆయుధం పాపాయి. వసంత జనం మధ్యలోంచి నడుస్తోంది. రేపటి నుంచి కొత్త కేసు. హియరింగూ, జడ్జిమెంట్లు. కాయితాల మీద పరిచిన జీవితం వరకే గదా జడ్జీగారి కళ్ళుపడేది! రుజువులు సాక్ష్యాల మధ్యనేగా కేసు నడుస్తూంట. బతుకంతా చదవండి జడ్జీగారూ. అడల్టరీ కేసు అంటే కోపం తెచ్చుకోకండి. నా తెలివితేటలు కత్తిరించే శిక్ష వేయండి. మామూలు భార్యను చేసేయండి...''

వసంత నీర్సంగా నడుస్తోంది అలసట వచ్చినట్లుగా.

గంట క్రితం వదిలేసిన పెండింగ్ వర్క్ అలాగే ఉంది. రేపటి నుంచి కొత్త ప్రాజెక్ట్ వర్క్ స్టార్టవుతుంది. వీటన్నింటి మధ్య ఎక్కడో జారిపోయిన జీవితం ఉంది. ఎక్కడో దొరుకుతుంది. వెతుక్కోవాలి వేగం.

ఆఫీసు మెట్లెక్కింది వసంత. తలుపులు నెట్టుకుంటూ లోపలకి వెళ్ళింది. కంప్యూటర్ స్క్రీన్ మీద గడ్డిపూవు. గాలికి అల్లరిగా కదులుతోంది. వంగిలేస్తోంది అందంగా, సహజంగా.

వసంత నిరుత్సాహంగా కంప్యూటర్ ముందు కూర్చుంది. గబగబా గడ్డిపూవుకి రంగులు పోసింది. అర్థంపర్థంలేని పట్టి గీతలాగా కనిపించిన గడ్డిపూవు ప్రాణం పోసుకొంది. గాలికి నేలకంటి వంగి లేస్తోంది. వసంతకు ఉత్సాహం వచ్చింది. ఇప్పుడు స్క్రీన్‌మీద ఫ్రీజ్ అయి నిటారుగా నిలబడింది గడ్డిపూవు మర్రిచెట్టు నిలబడినంత ఠీవిగా. 'వసంత' అన్న అక్షరాలు

టైప్ చేసింది. ఇప్పుడు స్క్రీన్ మీద గడ్డిపూవుకి దగ్గరగా వసంత అన్న అక్షరాలు కనిపిస్తున్నాయి. వసంతని కదిపినప్పుడల్లా గడ్డిపూవు ఉత్సాహంగా కదులుతోంది. వసంత చెవిలో హోరు తగ్గింది. తనకు ఆలంబన తనలో ఉన్న తన శక్తే. తనే తనకు ధైర్యం. తనే విశ్వాసం. తనే నిత్యవసంతం. తన కోసం తనే వీచే వె(రిపూల గాలి. చేతిలో  మౌస్ కింద పెట్టి వేళ్ళు విరుచుకుంది వసంత.

'రేపు చాలా పని ఉంది'

★

విపుల
జూలై, *1997*